భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 27.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
సోమవారం 1 సెప్టెంబరు 2025


చతుర్భుజ గణనాథుడు


ఎకో గణపతి


సువర్ణ గణపతి


అభయ వినాయకుడు

బహు రూపాయ గణేశాయ..!

పెంటపాడు మండలం అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ వద్ద చతుర్భుజుడై త్రిశూలం చేతబట్టి ప్రసన్న వదనంతో భక్తుల పూజలందుకుంటున్నాడు.

ముదినేపల్లి మండలం దేవపూడిలో ధవళ వస్త్రాలు ధరించి, చేతిలో లడ్డూతో చూడచక్కని రూపంతో పూజలందుకుంటున్న ఐదున్నర అడుగుల మట్టి వినాయకుడు.

పాలకొల్లు మెయిన్‌రోడ్డులోని గోల్డ్ మార్కెట్‌లో 12 అడుగుల బంగారు వర్ణంలోని గణనాథుడు ఠీవిగా ఆసీనుడయ్యాడు. బంగారు వర్తకులు దీనిని ఏర్పాటు చేశారు.

తణుకు కుచ్చర్లకోట వారి వీధిలోని మండపంలో విద్యుత్ మోటారు సాయంతో చేయి ఎత్తి భక్తులకు దీవెనలు అందిస్తున్నట్టుగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు..

చితికిన బత్తాయి


గూడెం మార్కెట్లో రంగు మారిపోతున్న బత్తాయిలు

మార్కెట్‌లో ధరలేక రైతు కుదేలు
అమ్ముదామంటే కొనేవారు లేరు
ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి
రంగుమారి కుళ్లుతున్న కాయలు
దిక్కుతోచని స్థితిలో రైతులు

తాడేపల్లిగూడెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : బత్తాయి రైతు కుదేలయ్యాడు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చేసరికి ధర లేకపోవడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి. ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టినా అసలు అమ్ముదామంటే కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. మార్కెట్‌కు తెచ్చి రాసిగా పోసి రోజు వచ్చి చూసి, కుళ్లిన కాయలను బయట పారపోసుకోవడం వంతుగా మారింది. ఇలాంటి దయనీయ పరిస్థితి బత్తాయి రైతు ఎన్నడూ చూడలేదు. ఈ సంవత్సరం వాతావరణం సరిగా అనుకూలించలేదనే చెప్పాలి. వర్షాలు కురిసే సమయంలో వర్షాలు పడకపోవడం, అవసరం లేని సమయంలో వర్షాలు కురిశాయని రైతులు వాపోతున్నారు. దీంతో బత్తాకాయలు సైజు పెరగకపోవడంతో పాటు, నాణ్యత లోపించింది. నిలువ ఆగే సామర్థ్యం ఈ సంవత్సరం బత్తాయిలో కనిపించడం లేదు. గతంలో బత్తాయి మార్కెట్‌కు వస్తే వారం రోజులపాటు రాసిగా పోసిన కాయలు చెక్కుచెదరకుండా ఉండేవని వ్యాపారులు చెబుతున్నారు. కాని ఇప్పుడు వచ్చే బత్తాయి మార్కెట్‌కు వస్తే రెండు మూడు రోజుల్లోనే కుళ్లిపోతున్నాయని పేర్కొంటున్నారు. వరలక్ష్మి వ్రతం, వినాయక చవితికి బత్తాయికి డిమాండ్ ఉండాల్సింది లేదు. దీనికి అధిక వర్షాలు కారణంగా వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చేసిన అప్పులు ఎలా తీర్చాలని రైతులు బెంబేలెత్తుతున్నారు.

ఉమ్మడి పశ్చిమలో 500 ఎకరాల్లో సాగు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 500 ఎకరాల్లో బత్తాయి తోటలను సాగుచేశారు. వీరందరికి ఈ సంవత్సరం నష్టాలే మిగిల్చింది. ఎకరం పొలంలో 70 మొక్కలను నాటుతారు. ఇవి ఒక్కో మొక్క నుంచి సరాసరి 1000 కాయలు దిగుతాయి. ఈ లెక్కన ఎకరాకు 70 వేల కాయలు వస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో మార్కెట్లో కొనుగోళ్లు లేకపోవడంతో ఇన్ని పెట్టుబడులు పెట్టిన రైతుకు నిరాశే మిగిలింది. గతంలో సాగు చేసిన రైతుకు ఎకరాకు ఖర్చులు పోను రూ.50 వేలు మిగిలేవి. ఇప్పుడు ధర పడిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి

ఎకరాకు రైతులు రూ.40 వేలు పెట్టుబడి పెట్టారు. లీజు ఎకరాకు రూ.60 వేలు మొత్తంగా సంవత్సరానికి రూ.లక్ష కౌలు రైతుకు అయింది. అదే స్వంతంగా బత్తాయి తోట ఉన్న రైతుకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టారు. ఒక్కో కాయకు బుట్ట కట్టడానికి రూ.1.5 అవుతోంది. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులకు ఎకరాకు రూ.25 వేలు అవుతోంది. దీనికి తోడు కోయడం, మార్కెట్ ట్రాన్స్‌పోర్టు, బస్తాల్లో ప్యాకింగ్ వంటి లెక్కగా తీసుకుంటే మొత్తంగా రూ.40 వేలు ఖర్చు చేశామని రైతులు వాపోతున్నారు. ఇప్పుడు 100 కాయలు అమ్ముదామన్నా రూ.200 కూడా కొనుగోల చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో రైతులు తెచ్చిన కాయలను మార్కెట్లో చూసుకుని తిరిగి వెళ్లడం తప్ప మార్గం లేకుండా పోయింది. ఈలోగా కాయలు పూర్తిగా రంగుమారి కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇలాంటి దయనీయ పరిస్థితులు ఎన్నడూ చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బత్తాయి రైతులను ఆదుకోకపోతే అప్పులు తీర్చలేక ఆత్మహత్యలే శరణ్యమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేసిన అప్పులు ఎలా తీర్చాలి



చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. తోటను రూ.60వేలుకు లీజుకు తీసుకున్నా. పెట్టుబడి రూ.40 వేలు అయింది. మొత్తంగా ఎకరాకు రూ.లక్ష అవుతోంది. పండించిన బత్తాయిని మార్కెట్‌కు తరలిస్తే కొనేవారు లేరు. రోజు మార్కెట్‌కు వచ్చి కాయలు చూసుకుని కుళ్లిన కాయలను బయట పోసుకుని వెళుతు న్నాను. ఏం చేయాలో తెలియని పరిస్థితి ప్రభుత్వం ఆదుకోవాలి.

- రాజమహేంద్రపు శ్రీను, కౌలు రైతు, నీలాద్రిపురం

బత్తాయిలో నాణ్యత లోపించింది



బత్తాయిలో నాణ్యత లోపించింది. దీంతో నిలువకు ఆగడం లేదు. త్వరగా కుళ్లిపోతున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుతో ఇలాంటి పరిస్థితి ఈ సంవత్సరం వచ్చింది. రిటైల్ వ్యాపారులు ఎవ్వరూ కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. ధర ఎన్నడూ లేనివిధంగా పడిపోయింది. రైతులకు పెట్టుబడులు పెట్టాం. తీరా అవి తీసుకోవాలన్నా అమ్మకాలు జరగడం లేదు.

- ఉదయ్, పండ్ల వ్యాపారి, తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం మార్కెట్ నుంచే ..

తాడేపల్లిగూడెం మార్కెట్‌కు రాష్ట్ర నలుమూలల నుంచి బత్తాయి దిగుమతి అవుతోంది. మాచెర్ల, రాజమండ్రి, దోసకాయలపాడు, నంది వాడ, చిన్నాయి గూడెం, కన్నాపురం, కొమ్ముగూడెం, నీలాద్రిపురం, తడికలపూడి ప్రాంతాల నుంచి తాడేపల్లిగూడెం మార్కెట్‌లోని హోల్‌సేల్ వ్యాపారుల వద్దకు వస్తాయి. వీటిని చిరు వ్యాపారులు కొనుగోలు చేసి గ్రామాలకు వెళ్లి విక్రయిస్తుంటారు. ఇలా వ్యాపారం జోరుగా సాగేది. కానీ ఇప్పుడు చిరు వ్యాపారులు సైతం కొనడానికి ముందుకు రావడం లేదు. ధైర్యం చేసి కొనుగోలు చేయాలన్నా 100 కాయల్లో 40 కాయల వరకు కుళ్లిపోవడంతో కొనుగోలు చేయడం మానేశారు. దీంతో మార్కెట్లోనే కాయలు కుళ్లిపోతున్నాయి.



ఊరేగింపులో అపశ్రుతి

5

దూసుకెళ్లిన ట్రాక్టర్..నలుగురి మృతి

ఉద్యాన వర్సిటీ వీసీ పదవిపై ఉత్కంఠ

నిబంధనల మేరకు 31న డాక్టర్ గోపాల్ పదవీ విరమణ
ఇన్‌ఛార్జ్ వీసీగా నియమించిన కూటమి ప్రభుత్వం
పొడిగింపు కోసం ప్రభుత్వానికి లేఖ..
హైకోర్టును ఆశ్రయించిన గోపాల్
ఆదివారం సెలవు కావడంతో ప్రభుత్వ స్పందన నిల్ .. నేడు ఏమవుతుందో ?



(భీమవరం-ఆంధ్రజ్యోతి):వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవిపై ఉత్కంఠ నెలకొంది. ఇన్‌చార్జ్ ఉప కులపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ బీగోపాల్‌కు ప్రభుత్వ నిబంధనల మేరకు ఆగస్టు 31తో పదవీ కాలం పూర్తయ్యింది. ప్రొఫెసర్‌గా ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఉన్నత విద్యాసంస్థల్లో పదవీ విరమణ వయసు 65 సంవత్సరాలకు పొడిగిస్తూ వైసీపీ హయాంలో నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అప్పటి వైస్ చాన్సలర్ ప్రసాద్‌రెడ్డి విషయంలో వైసీపీ ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత దానిని పెద్దగా పట్టించుకోలేదు. అదే తరహాలో ఉద్యాన, వ్యవసాయ, పశు సంవర్ధక విశ్వ విద్యాలయాల్లోనూ అధ్యాపక సిబ్బంది పదవీ విరమణ వయసు 65 ఏళ్లకు పెంచాలన్న డిమాండ్ ఉంది. పదవిని పొడిగించాలంటూ ప్రభుత్వానికి అభ్యర్థిస్తూ డాక్టర్ గోపాల్ లేఖ పెట్టుకున్నారు. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. వైస్ చాన్సలర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు పొడిగించాలంటే ప్రొఫెసర్‌గా విధుల్లో ఉండాలి. అప్పుడే ఇన్‌చార్జ్ బాధ్యతలను పొడిగించడం సాధ్యపడుతుంది. లేదంటే సెర్చ్ కమిటీ వేసి పూర్తిస్థాయి వైస్ చాన్సలర్‌గా నియమించాలి. దాని కోసం ముందునుంచే కసరత్తు చేయాలి. గతంలో డాక్టర్ జానకిరామ్ విషయంలో వైసీపీ ప్రభుత్వం అటువంటి కసరత్తు చేయకుండానే రెండో పర్యాయం వైస్ చాన్సలర్‌గా నియమించింది. హైకోర్టులో దీనిపై కేసు వేశారు. డాక్టర్ జానకిరామ్‌ను వైస్ చాన్సలర్ పదవిని హైకోర్టు ఏకంగా రద్దు చేసింది. ఇటువంటి న్యాయపరమైన చిక్కులతో -మిగతా 6లో..


కనకాయలంక కాజ్‌వే వద్ద వరద నీటిలో అవస్థలు

వరద గోదారి

భద్రాచలం వద్ద నిలకడగా గోదావరి
రెండో ప్రమాద హెచ్చరిక తొలగింపు
దిగువకు వరదనీటి ప్రవాహం
కుక్కునూరు, వేలేరుపాడు మండల గ్రామాల్లో నిలిచిన రాకపోకలు
ముంపుబారిన లంకగ్రామాలు
నరసాపురంలో వశిష్ఠ ఉగ్రరూపం


పెదమల్లం వద్ద..

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం/ పెనుగొండ/ ఆచంట /యలమంచిలి/ నరసాపురం,ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ భాగం నుంచి వచ్చి చేరుతున్న వరదతో భద్రాచలం వద్ద ఆదివారం ఉదయానికి 48 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మధ్యాహ్నానికి ఒక అంగుళం తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.భద్రాచలం నుంచి 11 లక్షల 39 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుండడంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలన్నీ వరదనీటిలో మునిగిపోయాయి. వీటితో పాటు వేలేరుపాడు, కోయిద, రహదారిపై వరదనీరు చేరుకోవడంతో 20 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. కుక్కునూరులో వరద నిలకడగా ఉంది. పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి మరింత పెరిగింది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఆక్రమించాయి.కడెమ్మ స్లూయిజ్ వద్ద వరద జలాలు పెరగడంతో గేట్లు మూసుకు పోయి ఏటిగట్టు కుడివైపున ఉన్న కొండవాగులు పొంగుతున్నాయి

లంక గ్రామాలకు వరద పోటు

ఎగువ నుంచి భారీగా వస్తున్న వరదనీటితో పెనుగొండ మండలం సిద్ధాంతం లంకభూముల్లోకి నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సిద్ధాంతం కేదార్ ఘాట్, పుష్కర ఘాట్‌లు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. దొంగరావిపాలెం, సిద్ధాంతం, నడిపూడి ప్రాంతాల్లో పశుగ్రాసం కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా వరద ఉధృతంగా ఉండటంతో చేపల వేట లేకుండా పోయిందని మత్స్యకారులు వాపోతున్నారు. సిద్ధాంతం,దొంగరావిపాలెంలో సుమారు 150 కుటుంబాల వరకు చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్నామని తమను ఆదుకోవాలని కోరుతున్నారు.ఆచంట మండలంలో -మిగతా 6లో..


చిన్నమామిడిపల్లి రైల్వే గేటు (ఫైల్ ఫొటో)

చిన్న మామిడిపల్లి రైల్వే వంతెనకు గ్రీన్ సిగ్నల్

గత ప్రభుత్వ హయాంలో ఫైల్ క్లోజ్
కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ జోక్యంతో ముందుకు..
మూసివేసిన రోడ్లను కలుపుతూ 260 మీటర్ల వంతెన
21 సెంట్ల స్థలం కేటాయింపు

నరసాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నరసాపురం పట్టణంలోని చిన్నమామిడిపల్లి వద్ద బ్రిటిష్ హయాం నుంచి రైల్వే గేట్ ఉండేది. అయితే విజయవాడ - నరసాపురంల మధ్య డబ్లింగ్ పనులు పూర్తి కావడంతో రైల్వే శాఖ ఈ గేటును మూసివేసింది. అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆర్ అండ్‌బీ రోడ్డును మూసివేసి గోడ కట్టింది. ప్రత్యామ్నాయంగా నరసాపురం-భీమవరం రోడ్డును కలుపుతూ చినమామిడిపల్లి గేటు అవతల వైపు నుంచి రైల్వే స్థలంలోంచి పట్టణంలోకి రోడ్డు వేసి కొత్త మార్గం చూపింది. అయితే దశాబ్దాలుగా ఉన్న రోడ్డును ఒక్కసారిగా మూసి వేయడంతో గేటుకు ఒకవైపు ఉన్న ప్రజలకు కొత్త ఇబ్బందులు వచ్చి పడ్డాయి. అవతలవైపు ఉన్న తమ పొలాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తున్నది. దీంతో వారు ఆందోళనకు దిగారు. వంతెన లేకపోతే అండర్ గ్రౌండ్ టన్నెల్ తవ్వాలని నేతలకు విన్నవిస్తూ వచ్చారు. అయితే సర్వే చేసిన రైల్వే ఇంజినీర్లు అండర్ గ్రౌండ్ సాధ్యం కాదని తేల్చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే వంతెన నిర్మాణం చేపడ తామన్నారు. ఈ నేపథ్యంలో ఇక తమ కష్టాలు తీరవని చినమామిడిపల్లి వాసులు భావించారు. టీడీపీ వార్డు కౌన్సిలర్ పాలూరి బాబ్జీ పట్టు వీడలేదు. నరసాపురం వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రభుత్వ విప్ నాయకర్‌తో కలసి సమస్యను వివరించారు. సమస్యను అర్థం చేసుకున్న నిర్మలమ్మ ప్రత్యేక దృష్టి సారించారు. సమస్యను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మూసి వేసిన ఫైల్‌లో కదలిక వచ్చింది. వంతెన నిర్మాణానికి ఇరిగేషన్, డ్రైనేజ్ శాఖ వల్ల ఏర్పడిన ఇబ్బందుల్ని క్లియర్ చేశారు. 21 సెంట్ల స్థలాన్ని కూడా కేటాయించేందుకు జిల్లా అధికారులు పచ్చ జెండా ఊపారు.

260 మీటర్ల ఫుట్ ఓవర్ వంతెన డిజైన్

విడిపోయిన రెండు చిన్నమామిడిపల్లి రోడ్లను కలుపుతూ 260 మీటర్ల పొడవైన వంతెన నిర్మాణానికి అధికారులు డిజైన్ చేశారు. ఎటువంటి ఆస్తి నష్టం జరగకుండా -మిగతా 6లో..

పెనుమంట్ర డీసీఎంఎస్ స్టాక్ పాయింట్‌లో
25 టన్నుల యూరియా మాయం?


పెనుమంట్రలో స్టాక్ పాయింట్

పెనుమంట్ర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పెనుమంట్ర సొసైటీలో నిర్వహిస్తున్న డీసీఎంఎస్ స్టాక్ పాయింట్‌లో 25 టన్నుల యూరియా నిల్వలు మాయమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. సొసైటీ నిర్వహణపై తొలి నుంచి ఆర్థిక అవకతవల ఆరోపణలు ఉన్నాయి. 2014లో అప్పటి ఎంపీపీ సరోజిని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. అనంతరం సీబీసీఐడీ విచారణతో సొసైటీ అధికారులు ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ పాలనలో ఎరువులు పురుగు మందులు విక్రయానికి డీసీఎంఎస్ ద్వారా స్టాక్ పాయిం ట్ ఏర్పాటుచేసి తాత్కాలిక ఉద్యోగిని నియమించారు. అప్పటి నుంచి సొసై టీకి సంబంధం లేకుండా డీసీఎంఎస్ పర్యవేక్షణలో ఎరువులు విక్రయాలు జరుగుతున్నాయి. తాత్కాలిక ఉద్యోగి ఈపాస్ లేకుండా, బినామీ పేర్లతో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులు స్టాక్ పాయింట్‌పై దృష్టి సారించి లక్షలాది రూపాయల అవకతవకలు గుర్తించారు. నిర్వాహకుడి నుంచి జిల్లా అధికారు లు రూ.22.25 లక్షలు రికవరీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అతడిని మరొక చోటికి బదిలీ చేయగా మూడు రోజుల ముందే గొడౌన్‌లో 25 టన్నుల యూరియా తరలించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్క రైతుకు యూరియా రెండు బస్తాలు మించి విక్రయించకూడదనే ఆంక్షల నేపథ్యంలో 25 టన్నుల యూరిగా ఎలా మాయమైందనేది ప్రశ్నార్థకం.

నరసాపురం పట్టణాన్ని
జిల్లా కేంద్రం చేద్దాం

- సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళదాం
- వైసీపీ హయాంలో జరిగిన అన్యాయాన్ని వివరిద్దాం
- ఐక్యంగా పోరాడదాం
- జేఏసీ సమావేశం తీర్మానం


జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ నాయకర్

నరసాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తీర ప్రాంతంలో ఉన్న అన్ని సబ్ డివిజన్లు జిల్లా కేంద్రాలయ్యాయి. ఒక్క నరసాపురం తప్ప.. అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు దీనికి కారణం. భౌగోళికంగా అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ ఉద్దేశ పూర్వకంగానే నరసాపురం పట్టణాన్ని జిల్లా కేంద్రం చేయలేదు. 60 రోజులు ప్రజలు పోరాడినా ప్రభుత్వం పట్టించుకోలేదు. జరిగిన అన్యాయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, కొత్త జిల్లాలపై ప్రభుత్వం నియమించిన కమిటీ దృష్టికి తీసుకెళ్లి తిరిగి జిల్లా కేంద్రం సాధించుకుందాం. ఇందుకు పార్టీలు పక్కనబెట్టి అంతా ఐక్యంగా ముందుకు సాగుదాం. నరసాపురంలో జేఏసీ తీర్మానం ఇది.

నరసాపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు నెక్కంటి సుబ్బారావు అధ్యక్షత ఆదివారం జేఏసీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ నాయకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం కోసం తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి జరిగిన అన్యాయాన్ని వివరిద్దామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నియమించిన కమిటీ చైర్మన్ మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకర్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు మాట్లాడుతూ అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు స్వార్థ రాజకీయాల వల్లే నరసాపురానికి జిల్లా కేంద్రం చేజారిపోయిందన్నారు. తీర ప్రాంతంలో ఉన్న అమలాపురం, మచిలీపట్నం, బాపట్ల సబ్ డివి జన్లను జిల్లా కేంద్రాలను చేసి ఒక్క నరసాపురానికే వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. దీనిపై మనమంతా ఐక్యంగా పోరాడదామన్నారు. టీడీపీ ఇన్‌చార్జి రామరాజు, కన్వీనర్ నెక్కంటి సుబ్బారావు, కోటిపల్లి సురేష్, పోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటులో జరిగిన తప్పులు సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం కమిటీ వేయడం శుభపరిణామం అన్నారు. కొత్తగా జిల్లా ఏర్పాటుచేసిన ప్రభుత్వానికి ఎటువంటి ఖర్చు కూడా ఉండదన్నారు. జిల్లా కేంద్రంలో అవసరమైన స్థలాలు, డివిజన్ కార్యాలయాలు నరసాపురం పట్టణంలోనే ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళదామని వారు అన్నారు. జేఏసీ సమావేశంలో మైలా వసంతరావు, దొండపాటి స్వామి, బాబ్జి, వర్దనపు ప్రసాద్, డాక్టర్ ప్రకాష్, సూరిబాబు, కొప్పాడ రవి, మార్రాజు, గుబ్బల నాగరాజు, వాతాడి ఉమా, వలవల నాని, కోటిపల్లి వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో వైసీపీ, కాంగ్రెస్ కుయుక్తులు
ఎంపీ పాకా సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఫైర్



పాలకోడేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భీమవరంలో కలెక్టరేట్ నిర్మాణంపై కూటమి నేతల మధ్య చిచ్చుపెట్టేలా వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు కుయుక్తులు పన్నుతున్నాయని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. పాలకోడేరులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో భీమవరం జిల్లా కేంద్రం విషయమై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ రెండు పార్టీలు ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా జిల్లా కేంద్రం ఎక్కడికో వెళ్లిపోతుందన్నట్లు మాట్లాడడం సమంజసం కాదన్నారు. 2026లో నియోజకవర్గాలు మారే అవకాశం ఉందని, భీమవరం మునిసిపాలిటీ విస్తరించే అవకాశం కూడా ఉందన్నారు. భీమవరం పట్టణానికి చేర్చి ఉన్న చాలా గ్రామాలు భీమవరం మునిసిపాలిటీలో విలీనమయ్యే అవకాశం ఉంది. ఏ గ్రామం ఎక్కడుంటుందో కూడా స్పష్టత లేదు. జిల్లా కేంద్రం భీమవరం చుట్టుపక్కల ఉంటుందని, దానిపై అపోహలకు తావివ్వవద్దని అన్నారు.

వారి వ్యాఖ్యలు విడ్డూరం

జిల్లా కేంద్రం భీమవరం విషయంలో కొంత మంది నేతలు కూటమికి బీటలు తేవాలనుకుని వాతలు పెట్టుకుంటున్నారని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పసుపు, ఎరుపు కలిపితే కాషాయం రంగు వస్తుందని, పాలు నీళ్ల వలె కలిసిపోయిన కూటమి పార్టీకి బీటలు తెచ్చేవిధంగా మాట్లాడడం విడ్డూరం గా ఉందన్నారు. భీమవరానికి అతి చేరువలో రహదారిని చేర్చి కలెక్టరేట్ నిర్మించేందుకు కృషి చేస్తుంటే కొంత మంది రాజకీయం చేస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని పన్నాగాలు పన్నినా ఎవరూ దెబ్బతీయలేరన్నారు.



డీఎస్సీ అభ్యర్థులకు
రెండో విడత కాల్ లెటర్స్?

- అధికారుల కసరత్తు

ఏలూరు అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2025 నియామకాల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని కేడర్ల నుంచి సుమారు 50 మందిలోపు అభ్యర్థులకు రెండో విడత కాల్‌లెటర్ల జారీ, సర్టిఫికెట్ల పరిశీలన ఉండవచ్చని సంకేతాలు అందుతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. మొదటి విడత కాల్ లెటర్లు జారీ అయిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికాగా, గైర్హాజరైన అభ్యర్థులు, ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకుని కాల్ లెటర్లు అందుకున్న వారి అర్హతలకు తగిన పోస్టు మినహాయించి మిగతా ఉద్యోగాలకు, ఆయా పోస్టులకు తగిన విద్యార్హతలు లేని వారిస్థానంలో తదు పరి మెరిట్ అభ్యర్థులతోపాటు, వివిధ రిజర్వేషన్ కేటగిరీల నుంచి అర్హులను చేర్చి రెండో విడత కాల్ లెటర్ల జారీ చేపట్టినట్టు తెలిసింది.

తెలుగు నిబంధన చర్చనీయాంశం

నవోదయ, కేంద్రీయ విద్యాలయ, సీబీఎస్ఈ, తదితర కేంద్ర విద్యాసంస్థల్లో చదివిన కొందరు అభ్యర్థులను 'తెలుగు' నిబంధనతో అనర్హులుగా చేయడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. జీవో నిబంధనల మేరకే విద్యార్హతలను ప్రామాణికంగా తీసుకున్నట్టు విద్యాశాఖ వర్గాలు చెబుతుండగా, డీఎస్సీ అభ్యర్థుల వాదన భిన్నంగా ఉంది. కేంద్ర విద్యాసంస్థల్లో పదో తరగతిలో ప్రథమ భాష లేదా ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా తెలుగు లేదా డిగ్రీలో కోర్ సబ్జెక్టుల్లో తెలుగు ఒకటిగా ఉంటేనే డీఎస్సీ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, తదితర పోస్టులకు అర్హులవుతారని విద్యాశాఖ వివరణ ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి విద్యా కోర్సుల్లో తెలుగు ఒక సబ్జెక్టుగా ఉంటే సరిపోతుందని అభ్యర్థులు చెబుతున్నారు. కేంద్ర విద్యా సంస్థల్లో టెన్త్ చదివిన విద్యార్థులకు ఫస్ట్ లాంగ్వేజీ తెలుగు ఉంటేనే డీఎడ్/బీఎడ్ ప్రవేశాలు కల్పిస్తామని అప్పట్లోనే విద్యాశాఖ షరతు పెట్టి ఉంటే తమకు డిగ్రీ, ప్రవేశ పరీక్షలు, ఉపాధ్యాయ విద్య శిక్షణ కోర్సు పూర్తి చేయడానికి వెచ్చించిన ఆరేళ్ల సమయం కోల్పోయేవారం కాదని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ ఉద్యోగాలకు పోటీపడి సెలక్షన్ జోన్‌లోకి వచ్చిన తరుణంలో నిబంధనల మాటున అనర్హులుగా చేయడం సబబు కాదని వాపోతున్నారు. ప్రభుత్వ పెద్దల వద్దకు వెళ్లడం లేదా కోర్టు, మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించనున్నట్టు ప్రచారం జరుగుతోంది. సెలక్షన్ జోన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు సెప్టెంబరు 5లోగా నియామక పత్రాలను జారీచేసి, తర్వాత పోస్టింగ్‌లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిసింది.

ఎంఈవోలు, హెచ్‌ఎంల గుర్రు

డీఎస్సీ ప్రకటన వెలువడిన నాటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వరకు ప్రతీ దశలో తమ వంతు విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ జిల్లా విద్యాశాఖాధికారులు చులకనభావంతో మాట్లాడుతున్నారని కొందరు ఎంఈవోలు, హెచ్‌ఎంలు ఆవేదన చెందుతున్నట్టు తెలిసింది. ఇటీవల రెండు రోజుల పాటు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఇతర అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు పనిచేశామని, అంతా విజయవంతంగా ముగిసిన తర్వాత వేధించే విధంగా ఒత్తిళ్లు తేవడం, అవహేళనగా మాట్లాడడాన్ని సహించలేకపోతున్నామని సహచరుల వద్ద వాపోతున్నట్టు సమాచారం. ఆదివారం సాయంత్రం జిల్లా విద్యాశాఖలోని ఒక కీలక అధికారి ఒక ఎంఈవోకు ఫోన్‌చేసి బెదిరింపు ధోరణిలో మాట్లాడ డంతో విసుగుచెందిన ఆ ఎంఈవో దీటుగానే స్పందించినట్టు తెలిసింది. నోటికి వచ్చినట్టు మాట్లాడితే సహించేదిలేదని చెప్పినట్టు సమాచారం. బోధనేతర సిబ్బందితో చేయించాల్సిన పనులను ఎంఈవోలు, హెచ్‌ఎంలు చేస్తున్నారని వివరణ ఇచ్చిన ఎంఈవో ఇక మీదట అభ్యంతకరంగా మాట్లాడితే ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పినట్టు తెలిసింది.

గణేశ్ ఉత్సవాల్లో విషాదం

నిమజ్జన ఊరేగింపులో నలుగురి దుర్మరణం


ప్రభుత్వాసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాయకర్, ఎస్పీ నయీం, కలెక్టర్ నాగరాణి

- తీవ్ర గాయాలైన మరొకరికి ఆస్పత్రిలో చికిత్స
- యువకులపైకి దూసుకుపోయిన వినాయక విగ్రహం ఉన్న ట్రాక్టర్
- ఈమన వారి మెరక నుంచి నరసాపురం గోదావరి వద్దకు ఊరేగింపు
- తూర్పుతాళ్ల వద్ద సంఘటన
- ఎమ్మెల్యే, ఎస్పీ, కలెక్టర్ పరామర్శ

మొగల్తూరు/నరసాపురం రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జన ఊరేగింపులో ఆదివారం రాత్రి అపశ్రుతి చోటు చేసుకుంది. ఊరేగింపులో డ్యాన్స్ చేస్తున్న బృందంపై వినాయక విగ్రహం ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా దూసుకుపోయింది. ఈసంఘటనలో నలుగురు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

నరసాపురం మండలం తూర్పుతాళ్లు గ్రామంలో జరిగిన సంఘటనపై పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈమన వారి మెరకలో వినాయక చవితి సందర్భగా 15 అడుగుల గణనాథుడి విగ్రహన్ని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు ఆదివారం నిమజ్జన ఊరేగింపు చేపట్టారు. నరసాపురం వద్ద గోదావరిలో నిమజ్జనం చేయడానికి గ్రామం నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. కొద్దిదూరం వెళ్లగానే ట్రాక్టర్ ముందు యువకులు నృత్యాలు చేస్తుండగా కమిటీ సభ్యులు గొడవ జరగకుండా గమనిస్తున్నారు. ఆ సమయంలో ట్రాక్టర్ ఒక్కసారిగా నృత్యం చేస్తున్న వారిపై దూసుకు వెళ్లింది. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడడంతో ఇద్దరిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి, మరో ఇద్దరిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. యివన సూర్యనారాయణ (58) అక్కడికక్కడే మృతిచెందగా తిరుమల నర్సింహమూర్తి (35), గురుజు మురళి (38), కడియం దినేష్ (9) మృతి చెందినట్టుగా గుర్తించారు. తీవ్రంగా గాయపడ్డ కంచర్ల ప్రసాద్‌ను ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు సమాచారం.

తీరంలో దిగ్భ్రాంతి

ఈ సంఘటనతో తీర ప్రాంతం ఉలిక్కిపడింది. గత మూడు రోజులుగా నిమజ్జనం సమయంలో పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ ఐజి అశోక్, ఎస్పీ నయీం, డీఎస్పీ శ్రీవేద సూచించారు. ఈ నేపథ్యంలో ఐదో రోజు గురువారం నరసాపురం పట్టణ, మండలంతో పాటు పాలకొల్లు ప్రాంతం నుంచి పలు విగ్రహాలు గోదావరిలో నిమజ్జనం చేసేందుకు తరలివచ్చాయి. ఏఎస్పీ భీమారావు పోలీస్ బందోబస్త్‌తో వలందర్ రేవు వద్ద ఉండి నిమజ్జన కార్యక్రమాలు పరిశీలిస్తున్నారు. తూర్పుతాళ్లలో నిమజ్జన ఊరేగింపులో ట్రాక్టర్ యువకులపై దూసుకువెళ్లిందన్న సమాచారంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. హుటాహుటిన రెవెన్యూ, మొగల్తూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో తరలించారు.

ఎమ్మెల్యే, ఎస్పీ, కలెక్టర్ పరామర్శ

సమాచారం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే నాయకర్ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లారు. మృతదేహాలను సందర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం, ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ శ్రీవేదకు ప్రమాద వివరాలను వివరించారు. చికిత్స పొందుతున్న యువకుడికి మెరుగైన వైద్యం అందించాలని నాయకర్ ఆదేశించారు.


ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో మృతదేహాలు



ఊరికి ఉదయమే వచ్చాడు!

వినాయక నిమజ్జన ఊరేగింపు సందర్భంగా జరిగిన ఘటనలో మృతుల్లో తిరుమల నర్సింహమూర్తి కార్పెంటర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు ఏడాది వయసు గల పిల్లలున్నారు. ఇద్దరు కవలలు, విశాఖలో పని చేసుకుంటున్న నర్సింహమూర్తి ఉదయమే గ్రామానికి వచ్చాడు. సాయంత్రం వరకూ భార్య, పిల్లలు, తల్లిదండ్రులతో గడిపి ఊరేగింపులో పాల్గొని మృత్యువాత పడ్డాడు.

మండుతున్న కూరగాయలు

తాడేపల్లిగూడెం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కూరగాయల ధరలు మండుతున్నాయి. గతవారం వరకు కిలో రూ.50 పలికిన వంకాయలు రూ.80 ధరకు చేరాయి. రూ.30 ఉండే దోసకాయలు రూ.50, రూ.90 ఉండే చిక్కుళ్లు ఇప్పుడు రూ.120కు చేరింది. కూరగాయల ధర గత వారంతో పోల్చుకుంటే కిలోకు రూ.5 నుంచి 10కు పెరిగాయి. కాగా ఆగాకర రూ.170 నుంచి 140కి దిగింది. టమాట కూడా 60 నుంచి 40కు వచ్చింది. బీరకాయలు కిలో రూ.50, బెండ, దొండ కిలో రూ.40, క్యాప్సికం రూ.100, కాకర రూ.50, గోరు చిక్కుళ్లు రూ.80, క్యారెట్ రూ.50కు విక్రయించారు.

మార్కెట్లో మహరాష్ట్ర ఉల్లి ధర నిలకడగా ఉంది. నాణ్యమైన ఉల్లి 4 కిలోలు రూ.100, రెండో రకం 5 కిలోలు రూ.100 చొప్పున విక్రయించారు. కర్నూలు ఉల్లి ధర పతనమైంది. 7 నుంచి 8 కిలోలు రూ.100 వంతున విక్రయించారు. కొనుగోలుదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఈ ఉల్లిలో డ్యామేజ్ ఎక్కువగా కనిపించడంతో పాటు ఎర్రగా ఉన్నాయి.

ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా మహ్మద్ మాజీద్



నిడమర్రు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా క్రొవ్విడి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మహమ్మద్ నూరుద్దీన్ (మాజీద్) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాజీద్‌కు ఫోన్‌చేసి అభినందించారు. మాజీద్ మాట్లాడుతూ క్రమశిక్షణ గల కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ గుర్తింపు ఇస్తుందని తన నియామకం నిరూపించిందన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఉంగుటూరు నియోజకర్గ కన్వీనర్ గన్ని వీరాంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీద్‌ను మండల కన్వీనర్ ముత్యాల స్వామి, పొట్నూరి సింహచలం, మహ్మద్ గఫార్ ఖాన్, ఆదిరెడ్డి చంద్రరావు, మహమ్మద్ జాకీర్ తదితరులు అభినందించారు.

అదృశ్యమైన హెడ్ కానిస్టేబుల్ మృతి

- ఎర్రకాలువలో మృతదేహం లభ్యం
- విధుల్లో ఉండగా ద్విచక్ర వాహనంతో గల్లంతు
- కుటుంబ సభ్యులకు ఎస్పీ పరామర్శ

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ మృతదేహం ఎర్ర కాలువలో ఆదివారం లభ్యమైంది. ఆగస్టు 29న రాత్రి నుంచి కనిపించకుండా పోయిన ఎస్పీ హెడ్ కానిస్టేబుల్ బుడుపుల సుబ్బారావు (55) మృతి చెందారు. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం సమీపంలో ఎర్రకాలువలో ఆయన లభ్యమైంది. డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపిన వివరాల ప్రకారం కామవరపుకోట, టి.నరసాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో సుబ్బారావు స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామం బుట్టాయగూడెం నుంచి ప్రతీరోజు విధులకు హాజరవడం ఇబ్బందిగా ఉందని కామవరపుకోటలోనే గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. 29న రాత్రి విధుల్లో భాగంగా టి.నరసాపురం మండలం మధ్యాహ్నపువారిగూడెం నుంచి అప్పలరాజుగూడెం రహదారిలో చప్టాపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాలువలో ప్రమాదవశాత్తు సుబ్బారావు తన ద్విచక్ర వాహనంతో పాటు గల్లంతయ్యాడని డీఎస్పీ తెలిపారు. వరద ఉధృతిని అంచనా వేయలేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామన్నారు. సుబ్బారావు ఫోన్ పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆయన కుమారుడు జాన్ రాజు శనివారం తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. సుబ్బారావు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఆధునిక సాంకేతికను ఉపయోగించి జంగారెడ్డిగూడెం, పోలవరం డీఎస్పీలు రవిచంద్ర, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నుంచి ఎర్రకాలువలో ఫైర్, ఫిషరీస్ సిబ్బంది, గజ ఈతగాళ్ల, డ్రోన్ కెమేరాలతో గాలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశం వద్ద సుబ్బారావు ద్విచక్ర వాహనం లభ్యమైంది. ఆదివారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు చేపట్టగా గల్లంతయ్యాడని భావిస్తున్న ప్రదేశానికి మూడు కిలో మీటర్ల దూరంలో కాలువలో మృతదేహం లభ్యమైంది. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. సుబ్బారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


కాలువలో లభ్యమైన మృతదేహం (ఇన్‌సెట్) సుబ్బారావు (ఫైల్)


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్పీ కిశోర్

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎస్పీ

బుట్టాయగూడెం: మృతి చెందిన సుబ్బారావు కుటుంబ సభ్యులను ఎస్పీ కేపీఎస్.కిశోర్ పరామర్శించారు. అతడి భార్య పిల్లలకు ధైర్యం చెప్పి, శాఖాపరంగా ఆదుకుంటామన్నారు. పూర్తి విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు. డీఎస్పీ వెంకటేశ్వరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ మల్లేశ్వరావు నివాళులర్పించారు.

సుబ్బారావు మృతదేహనికి పోలీస్ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సమాధి కార్యక్రమానికి ముందు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. డీఎస్పీ, సీఐలు, ఎస్ఐ పోలీసులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

స్నేహితుడే.. కత్తితో పొడిచేశాడు

ఏలూరులో పట్టపగలు దారుణ హత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ స్నేహితులే. వారిద్దరి మధ్య ఏమి జరిగిందో.. ఇంట్లో అప్పుడే భోజనంచేసి చేయి కడిగి తుడుచుకుంటుండగా కారులో వచ్చిన స్నేహితుడు అన్నా పని ఉందంటూ కారు వద్దకు తీసుకువెళ్లాడు. అకస్మాత్తుగా కత్తితో పొడిచాడు. అతడికి మరో యువకుడు సహాయం చేయగా మరో ఇద్దరు యువకులు కారులోనే ఉన్నారు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. హత్యకు కారణాలు అంతుపట్టలేదు. స్థానికులు, పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం..

ఏలూరు రూరల్ మండలం కొమడవోలు పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో ఉంటున్న పూనూరి రాజేష్ (42)కు భార్య దైవమణి, కుమార్తె సంజన, కుమారుడు సంతోష్ ఉన్నారు. ఒక టీడీపీ నాయకుడి వ్యాపార, వ్యవహారాలను రాజేష్ చూస్తూ ఉంటాడు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులందరూ భోజనం చేస్తున్నారు. రాజేష్ అప్పుడే భోజనం చేయగా అదే ప్రాంతానికి చెందిన రాజేష్ స్నేహితుడు సరిపల్లి విజయ్ అలియాస్ చిన్ని నాని అనే కారు డ్రైవర్ అన్నా మాట్లాడే పని ఉందంటూ పిలిచాడు. మాట్లాడుతూ కారు వద్దకు తీసుకువెళ్లాడు. రాజేష్ కుమారుడు సంతోష్ కూడా బయటకు వచ్చి చూస్తున్నాడు. బాలుడి కళ్ల ముందే అకస్మాత్తుగా నాని కత్తితీసి రాజేష్‌ను పొడిచాడు. ఏలూరునకు చెందిన లంకపల్లి బాలకృష్ణ అలియాస్ బాలు కూడా ఈ దాడిలో పాల్గొన్నారు. మరో ఇద్దరు కారులో ఉన్నారు. కత్తిపోట్లు గురైన రాజేష్ అరుస్తూ తన ఇంటిలోకి పరిగెడుతూ వరండాలో పడిపోయాడు. భోజనం చేస్తున్న రాజేష్ భార్య దైవమణి, కుమార్తె సంజన, దైవమణి సోదరి నాగమణి పరిగెత్తుకుని బయటకు వచ్చి వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా కారెక్కి వెళ్లిపోయాడు. రాజేష్‌ను వెంటనే ఆటోలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, రూరల్ ఎస్ఐ బి.నాగబాబు, సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద మృతుని కుటుంబ సభ్యుల నుంచి డీఎస్పీ వివరాలు అడిగి తెలుసుకున్నారు.


మృతుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

రెండు రోజుల క్రితం..

ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితమే ఏలూరుకు చెందిన లంకపల్లి బాలకృష్ణ అలియాస్ బాలు చిరంజీవి బస్టాప్ ప్రాంతానికి తన అనుచరులతో వెళ్లి అక్కడ వేరే వారితో గొడవకు దిగి హత్య చేస్తానంటూ స్థానికులను బెదిరించాడు. పోలీసులు రెండు వర్గాలను పిలిచినప్పటికీ సరైన బైండోవర్ చేయకపోవడంతోనే బాలు ఈ హత్యలో పాల్గొన్నట్లు చెబుతున్నారు. తానేమిటో చూపిస్తానంటూ అక్కడ బెదిరింపులకు పాల్పడ్డాడని పోలీసులు మాత్రం ఈ వ్యవహారాన్ని పట్టించుకోలేదని అందువల్లే ఈ హత్య జరిగిందంటూ చెప్పుకుంటున్నారు. ఇటీవల ఘర్షణకు పాల్పడుతున్న వారిపై పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని, శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడుతుందని పలువురు చెబుతున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్దకు వందలాది మంది చేరుకున్నారు. టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ వారి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.


రాజేష్ మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్)

ప్రత్యేక బృందాలతో గాలింపు

రాజేష్ హత్య కేసులో నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. నిందితులను గుర్తించామని, నలుగురు పాల్గొన్నట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. మృతుని కుటుంబ సభ్యులు హంతకులను గుర్తించారని, నిందితులను అరెస్టు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ముందస్తుగా ఆ ప్రాంతంలో పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశామన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, హత్యకు కారణాలు, ఆధారాలు సేకరిస్తున్నామన్నారు.

మావుళ్లమ్మకు 10 గ్రాముల బంగారం



భీమవరం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మావుళ్లమ్మ అమ్మవారి స్వర్ణ వస్త్రం కోసం హైదరాబాద్‌కి చెందిన దాట్ల సురేష్ కుమార్ శాంతి కుమారి దంపతులు సుమారు రూ.90 వేలు విలువచేసే 10 గ్రాముల బంగారం విరాళంగా అందజేశారు.

సంచార వైద్య సేవలు

తణుకు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఉచిత సంచార వైద్య సేవలు ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పది మందికి ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ రాజేంద్ర కలిసి వైద్య సేవలందించారు. కాకరపర్తి సత్యవతి ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోశాధికారి అర్థి భాస్కరరావు, గిరజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పశ్చిమలోనే గణపవరం కొనసాగించాలి





కలెక్టర్ నాగరాణితో ఫోన్‌లో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ (ఇన్‌సెట్‌లో) డిప్యూటీ స్పీకర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని

భీమవరం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలానికి చెందిన వ్యాపార సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు నరసయ్య అగ్రహారంలోని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ నివాసం వద్ద ఆయనను కలిశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డివిజన్ పరిధిలో ఉన్న గణపవరం మండలాన్ని యథాతథంగా ఉంచాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ గణపవరం మండలాన్ని జిల్లాలోనే ఉంచాలనే ప్రజల డిమాండ్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. వెంటనే జిల్లా కలెక్టర్ నాగరాణికి ఫోన్‌లో ఇదే విషయాన్ని తెలిపారు. రెండు రోజుల్లో గణపవరం వాసులకు మద్దతుగా లిఖితపూర్వకం గా లేఖను జిల్లా యంత్రాంగానికి, ప్రభుత్వానికి కూడా పంపిస్తానని తెలిపారు.

కాళ్ళ: గణపవరం మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోనే కొనసాగించాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజుని అఖిల పక్షం నేతలు కోరారు. పెద అమిరంలోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు సమక్షంలో అఖిలపక్షం నాయకులు వినతిపత్రం సమర్పించారు.

ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు



సమావేశంలో మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ

తణుకు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి ప్రాణ ప్రదమైన ఎన్నికల వ్యవస్థకు కీలకమైన ఓటర్ల జాబితాలను తారుమారు చేస్తూ ఓట్ చోరీకి పాల్పడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టువంటిదని సామాజిక విశ్లేషకులు డీవీవీఎస్ వర్మ అన్నారు. ఆదివారం సురాజ్య భవనంలో ఓట్ చోరీపై చర్చాగోష్ఠికి అధ్యక్షత వహించి మాట్లాడారు. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా లక్షల ఓట్లు చోరీకి పాల్పడిందని ఆరోపించారు. తొలగించిన ఓట్లు నమోదుకు కష్టతరం చేసి పేదలు, వలస కూలీలు, మైనార్టీల ఓటు హక్కును తొలగించిందని విమర్శించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి చోడే గోపికృష్ణ మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించే విధంగా ప్రజలు చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. సీపీఐ నాయకులు కోనాల భీమారావు, బొద్దాని నాగరాజు, సీపీఎం నాయకులు అజయకుమారి, కామన మునిస్వామి, కాంగ్రెసు నాయకులు దిర్సిపో రామ కృష్ణ, రామారావు, కౌరు వెంకటేశ్వర్లు, సంకు మనోరమ పాల్గొన్నారు.

నిత్యం జీవితంలో వ్యాయామం భాగం కావాలి

తణుకు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో వ్యాయామం భాగం కావాలని పట్టణ సీఐ కొండయ్య అన్నారు. ఆదివారం పట్టణ పోలీసు సిబ్బందితో కలిసి సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు నిత్యం పని ఒత్తిడితో ఉంటారన్నారు. అందుకోసం రోజు దిన చర్యలో వ్యాయామం భాగంగా చేసుకుని ఒత్తిడి తగ్గించుకోవాలని అన్నారు.

ప్రీమియంపై జీఎస్టీ తొలగించాలి

తాడేపల్లిగూడెం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలకు లక్షల కోట్లలో చేయూత నిస్తూ ప్రభుత్వ రంగంలో అగ్రగామి ఆర్థిక సంస్థగా జీవిత బీమా నిలిచిందని ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గరికపాటి బాపయ్య శర్మం హర్షం వ్యక్తం చేశారు. జీవిత బీమా సంస్థ ఏర్పడి 2025 సెప్టెంబర్ 1వ తేదీ నాటికి 69వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. 1956లో కేవలం రూ.5కోట్ల పెట్టుబడితో జీవిత బీమా ఏర్పాటు చేస్తే ఇప్పుడు రూ.54 లక్షల కోట్ల ఆస్తులతో నిలిచిందన్నారు. బీమా ప్రీమియంపై జీఎస్టీ తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

పశువుల దాణా అందజేత

యలమంచిలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని వరద ముంపు బారినపడ్డ కనకాయలంక, పెదలంక గ్రామాల్లో పాడిరైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. కనకాయలంక గ్రామంలో 12 టన్నులు, పెదలంకలో 8టన్నులు పశువుల దాణాను మండల టీడీపీ అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి పాడిరైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి, పెదలంక, కనకాయలంక సర్పంచులు తాళ్ల నాగరాజు, మద్దా శ్రీనివాస్, ఎన్డీఏ నాయకులు బొప్పన హరికిషోర్, కడలి గోపి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

ఆచంట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 44 మంది బాధితులకు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ రూ.23,81,088 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం అందించారు.

వీసీ పదవిపై ఉత్కంఠ

(3వ పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం ప్రస్తుత ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గోపాల్ విషయమై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయిందన్న వాదన వినిపిస్తోంది.

పదవీ విరమణ చిక్కుముడి కానుందా ?

వాస్తవానికి ఆదివారంతో డాక్టర్ బి.గోపాల్ 62 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఆదివారం డాక్టర్ గోపాల్ ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేయాలి. సాంకేతికంగా పదవీ విరమణ అయినట్టే. కానీ డాక్టర్ గోపాల్ హైకోర్టును ఆశ్రయించారు. ఉన్నత విద్యాచట్టంలో 65 ఏళ్ల విషయం ఉందంటూ హైకోర్టు ప్రస్తావించింది. ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీచేసింది. దాంతో ప్రభుత్వం ఇప్పుడు ఏమి చేస్తుందనే విషయం చర్చనీయాంశంగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు వెలువడ లేదు. హైకోర్టు ఆదేశాలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటోందోనంటూ విశ్వవిద్యాలయ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. సోమవారం ప్రభుత్వం నుంచి స్పష్టత రానుంది.

వరద గోదావరి

(3వ పేజీ తరువాయి)



నరసాపురం వలంధర్ రేవు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వశిష్ఠ గోదావరి

పుష్కర ఘాట్‌లు పూర్తిగా నీట మునిగాయి. లంకలో పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే వరద ముంపులోనే ఉంది. ఇతర గ్రామాలకు పడవల్లో ప్రయాణిస్తున్నారు. ఈ నెలలో రెండోసారి వరద రావడం కాజ్ వే సుమారు 10 రోజులు వరదముంపులో ఉండటంతో కనకాయలంక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు.

వశిష్ఠ ఉగ్రరూపం..నిలిచిన రాకపోకలు

వశిష్ఠ గోదావరికి మరోసారి వరద పోటెత్తింది. ఎగువ నుంచి ఆరు లక్షల క్యూసెక్కుల వరద నీరును సముద్రంలోకి విడిచిపెట్టడంతో ఆ ప్రభావం వశిష్ఠకు తాకింది. నీటి ప్రవాహం ఉధృతంగా మారడంతో నరసాపురం-సఖినేటిపల్లి రేవుల మధ్య రాకపోకల్ని నిలిపివేశారు. దీంతో పశ్చిమ-కోనసీమ జిల్లాల మధ్య పంటు, పడవుల రాకపోకలు ఆగిపోయాయి. నిత్యం జనంతో సందడిగా కనిపించే మాధవాయిపాలెం రేవు బోసి పోయింది. స్టీమర్ రోడ్డు నిర్మానుష్యంగా మారింది. ఇటు వలంధర్‌రేవు, బాబు ఘాట్, అమరేశ్వర, కొండాలమ్మ రేవుల్లో నీటి మట్టాలు పెరిగి పైమెట్లు వరకు నీరు చేరింది. పట్టణంలోని అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్లన్నీ మూసివేశారు. లీకేజీలు ఉన్న చోట్ల ఏటిగట్ల శాఖ సిబ్బంది ఇసుక బస్తాలు వేస్తున్నారు. ఆ శాఖ ఏఈ పవన్ గట్లను పర్యవేక్షిస్తున్నారు. రేవులో పడవలు తిరగకుండా పోలీస్ బందోబస్తు పెట్టారు.

రైల్వే వంతెనకు గ్రీన్ సిగ్నల్

(3వ పేజీ తరువాయి)

పనులు ప్రతిపాదించారు. ఇందుకు ఇరిగేషన్ డ్రైనేజీ శాఖలకు చెందిన 21 సెంట్లు ప్రభుత్వ స్థలం కేటాయించనున్నారు. వంతెన వెడల్పు కేవలం 10 అడుగులు మాత్రమే ఉండనుంది. ఈ కారణంగా మోటార్ సైకిళ్లు, ఆటోలు మాత్రమే వెళ్లనున్నాయి. నిర్మాణ పనులకు సుమారు రూ.6 నుంచి రూ.10 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం రైల్వే శాఖే భరించనుంది.

కేంద్రమంత్రి నిర్మలమ్మ కృషి

పాలూరి బాబ్జీ, వార్డు కౌన్సిలర్, టీడీపీ సీనియర్ నాయకుడు



గత ప్రభుత్వ హయాంలో అధికారులు వంతెన నిర్మాణం ఖర్చుతో కూడుకున్న పనంటూ ఫైల్ మూసివేశారు. దీంతో నిరాశ పడ్డాం. ఎంపీ శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు చొరవతో సమస్యను కేంద్రమంత్రి నిర్మల దృష్టికి తీసుకెళ్లాం. మా ఇబ్బందుల్ని తెలుసుకున్న మంత్రి దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. దీంతో పనులు స్పీడ్ అయ్యాయి.

వినాయకుని లడ్డూ వేలం



వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న ఏఎంసీ డెరెక్టర్ లక్ష్మణరెడ్డి

పెంటపాడు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పెంటపాడు కాలేజ్ సెంటర్ సమీపంలో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుని వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి లడ్డూను వేలంపాట నిర్వహించారు. ఏఎంసీ డైరెక్టర్ కొవ్వూరి లక్ష్మణరెడ్డి లడ్డును రూ.22 వేలకు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షుడు నల్లమిల్లి విజయ్ ఆనందరెడ్డి పాల్గొన్నారు.

గణపతి పందిళ్లలో వలవల పూజలు



ఉత్సవ పందిరిలో వలవల బాబ్జి, భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆరుగొలను, కొండ్రుప్రోలు గ్రామాల్లో కొలువైన గణనాథులను భవన నిర్మాణ, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి సందర్శించి ఆదివారం పూజలు నిర్వహించారు. కొండ్రుప్రోలులో జరిగిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆయన నివాసం వద్ద ఇటీవల కార్మిక బోర్డు చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు వలవల బాబ్జిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు కిలపర్తి వెంకట్రావు, ముప్పిడి రమేష్, సర్పంచ్ పీతల బుచ్చిబాబు, మాజీ ఎంపీటిసి పసల గణేష్ పాల్గొన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలి



సింగపూర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తెలుగువారు ఎక్కడున్నా తరతరాలు నుంచి వస్తున్న సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం సింగపూర్‌లోని తెలుగు సమాజం స్థాపించి 50 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా సింగపూర్‌లో జరిగిన వేడుకల్లో మాజీ అధ్యక్షుడు హోదాలో హాజరయ్యి మాట్లాడుతూ సింగపూర్‌లో నివాసం ఉంటున్న ప్రవాసాంధ్రులు అంతా కలసికట్టుగా తెలుగు సమాజాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని కోరారు.

పేకాట శిబిరాలపై దాడి

తణుకు రూరల్, అగస్టు 31 (ఆంధ్రజ్యోతి):మండపాక, వేల్పూరు గ్రామాల్లో పేకాట శిబిరాలపై పోలీసులు జరిపిన దాడిలో 9 మందిని అరెస్ట్ చేసినట్టు తణుకు రూరల్ ఎస్ఐ కె చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం మండపాక గ్రామంలో దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 3,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వేల్పూరు గ్రామంలో దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 12, 250 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

డెల్టా పునర్ వ్యవస్థీకరణపై దృష్టి

భీమవరంటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డెల్టా సిస్టం పునర్ వ్యవస్థీకరణ, చెత్త నిర్వహణకు అనువైన మార్గాలపై దృష్టి సారించినట్టు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, చెన్నై ఐఐటి ప్రముఖ సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్, పోలవరం ప్రాజెక్టు మాజీ సలహా దారు డాక్టర్ వి.ఆర్ రాజు పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో కాలువలు, డ్రెయిన్‌లు కలుషిత వ్యర్థాలతో నిండిపోవడం, ఆక్రమణలకు గురికావడం గుర్తించినట్టు తెలిపారు. దీనితో డ్రెయిన్ల ప్రక్షాళన గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు డిప్యూటీ స్పీకర్ తెలిపారు.

ఎంఈవో-2 రామకృష్ణకు గౌరవ డాక్టరేట్

పెంటపాడు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంఈవో-2గా బాధ్యతలు నిర్వహిస్తున్న టీవీ రామకృష్ణను గౌరవ డాక్టరేట్ వరించింది. విద్యా సంస్థలో తాను చేసిన మెరుగైన సేవలు, సామాజిక కార్యక్రమాలకు గాను ఈ అవార్డు దక్కింది. శనివారం రాత్రి హైదారాబాద్ లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ(పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం)లో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఈ డాక్టరేట్ ను రామకృష్ణకు అందజేసింది.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న గంటా త్రిమూర్తులు

భీమవరం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు సరైన చికిత్సలు చేయించుకోవాలని కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. భీమవరం 4వ వార్డు నరసయ్య అగ్రహారంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని చైర్మన్ త్రిమూర్తులు ప్రారంభించి మాట్లాడారు. అనుభవజ్ఞులైన డాక్టర్ల అందుబాటులో ఉన్నారని, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

వెరికోస్ వ్యాధిపై నిర్లక్ష్యం తగదు

భీమవరం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాళ్ళలోని సిరల్లో ఒత్తిడి పెరగడం వల్ల వెరికోస్ వెయిన్స్ వస్తాయని, వెరికోస్ వెయిన్స్ అనేవి చర్మంపై కనిపించే అసాధారణంగా విస్తరించిన సిరలని లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్టు గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, జోన్ చైర్మన్ నడింపల్లి మహేశ్ కుమార్ వర్మ, క్లబ్ అధ్యక్షుడు బొండా రాంబాబు అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వెరికోస్ నరాలు (ఉబ్బిన సిరలు) ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ లావణ్య మాట్లాడుతూ వెరికోస్ వెయిన్స్‌కు చికిత్స చేయకపోతే చర్మం విరిగి పుండుగా ఏర్పడుతుందని అన్నారు. ఈ వ్యాధిపై నిర్లక్ష్యం తగదన్నారు.



కొత్తపల్లి నాగరాజును సత్కరిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, గన్ని, మంతెన, సుజాత

పాలకోడేరు సొసైటీ దినదినాభివృద్ధి చెందాలి

సొసైటీ సభ్యులకు అభినందన

పాలకోడేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు విశాల సహకార పరపతి సంఘం దినదినాభివృద్ధి చెందాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికైన కొత్తపల్లి నాగరాజు అభినందన సభకు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో రైతులకు కావలసిన ఎరువులు, పురుగు మందులను అందిస్తూ రాష్ట్రంలో ఐదు బ్యాంకులు ముందంజలో ఉండగా వాటిలో పాలకోడేరు బ్యాంకు ఒకటి కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. సొసైటీ సభ్యులుగా ఎన్నికైన పాల నాగ గంగాధర్, అప్పారావులను అభినందించారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు ప్రసంగించారు. అనంతరం నూతనంగా ఎన్నిక కాబడిన కొత్తపల్లి నాగరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కునాథరాజు మురళీకృష్ణంరాజు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూరి, జుత్తిగ నాగరాజు, ముత్యాల రత్నం, బ్యాంకు సీఈవో పెనుమత్స నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోగల్లులో ఆదివారం ఎంపీఎస్‌సీ గొడౌన్‌ను డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు ప్రారంభించారు. కనుమూరి భరత్ పాల్గొన్నారు.

చాంబర్స్ కళాశాల స్వర్ణోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఛాంబర్స్ కళాశాలల స్వర్ణోత్సవాలను అక్టోబర్ 11, 12 తేదీలలో నిర్వహించాలని ఛాంబర్ నిర్ణయించింది. ఈ సందర్భంగా చాంబర్ కార్యాలయంలో స్వర్ణోత్సవాల బ్రోచర్‌ను ఆదివారం ఛాంబర్ అధ్యక్షుడు కేవీఆర్ నరసింహారావు ఆవిష్కరించారు. ఛాంబర్స్ జూనియర్ కళాశాల 50 సంవత్సరాలు, డిగ్రీ కళాశాల 30 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల ఏర్పాట్లపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాలని తీర్మానించారు.

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది



వినాయక మండపంలో నిర్వాహకులతో ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వ వార్డులో వినాయక చవితి 21వ వార్షికోత్సవంలో భాగంగా పవర్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. ముందుగా మహా నివేదనకు పూజలు చేసి అన్న సమారాధనను ప్రారంభించారు. వందలాది మంది భక్తులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు మణికంఠ, బ్రహ్మాజీ ,బన్ను, శివ కృష్ణ, దిలీప్, శివ, బ్రహ్మం, రాంబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నసమారాధనను ప్రారంభించిన మెంటే పార్థసారథి

భీమవరం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): 14వ వార్డు ముత్యంవారి తోటలో శ్రీరామ బాల భక్త మణి కంఠ సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కోశాధికారి మెంటే పార్థసారథి అఖండ అన్న సమారాధనను ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ భీమవరం పట్టణ అధ్యక్షుడు మద్దుల రాము నిర్వాహణలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు చల్లబోయిన గోవిందు, మైలబత్తుల ఐజాక్ బాబు, చల్లబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

మొగల్తూరు, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి అనుమానాస్పద మృతిపై కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు మొగల్తూరు ఎస్ఐ వై. నాగలక్ష్మీ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం కాళీపట్నం గ్రామానికి చెందిన కొత్తపల్లి శేషప్రభావతి (70) తన స్వగృహంలో ఒక్కరే నివసిస్తున్నారు. శనివారం రాత్రి ఆమె కుమారుడు నాగ వెంకట లక్ష్మీ నర్సింహతో ఫోన్‌లో మాట్లాడారని ఆదివారం ఉదయానికి ఆమె మృతి చెందడంలో కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పెంటపాడు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయం జోనల్ కోఆర్డినేటర్ గద్దె వెంకటరత్నం అన్నారు. ఆదివారం మీనవల్లూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాలు వాడవద్దని కషాయం మాత్రమే ఉపయోగించాలన్నారు. అనంతరం 30 ఎకరాలలో తెగుళ్ళకు సంబంధించి కషాయాన్ని డ్రోన్ స్ప్రే చేశారు.

వసుధా సేవలు స్ఫూర్తిదాయకం



విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందిస్తున్న కలెక్టర్ నాగ రాణి, ఫౌండేషన్ చైర్మన్ వెంకట రామరాజు

పాలకోడేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వసుధ ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గరగపర్రు గ్రామంలోని వసుధ వాత్సల్య కేంద్రం వద్ద ఆదివారం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన 21 సేవా సంస్థలకు రూ.28 లక్షల చెక్కుల రూపంలో అందించారు. 11 మంది రోగులకు రూ. 2.50 లక్షల నగదు ఇచ్చారు. ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులు 30 మందికి రూ.2.10 లక్షలు ఉపకార వేతనాలను అందించారు. కన్వీనర్ యిందుకూరి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

శిల్ప కళాకారుడు వడయార్‌కు అభినందన



వడయార్‌ను అభినందించిన శైలజ, సుధాకర్

పెనుమంట్ర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని జీవకళ ఉట్టుపడే విధంగా రూపొందించిన శిల్ప కళాకారుడు పెనుగొండ కరుణాకర్ ఉడయార్‌ను జల వనరుల శాఖ అధికారులు ఘనంగా సత్కరించారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ప్రారంభించిన సినీ నటుడు శుభలేఖ సుధాకర్, గాయని ఎస్పీ శైలజలు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. శిల్పి కరుణాకర్ వడయారును అభినందించినట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కరుణాకర్ వడయార్ శిల్పకళా రంగంలో మరింత రాణించాలని ఆకాంక్షించారు.

బైబై గణేశా... ఘనంగా నిమజ్జనాలు



నరసాపురంలో గోదావరిలో నిమజ్జనం

నరసాపురం టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వలందర్ రేవులో ఆదివారం సాయంత్రం గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భక్తులు పోటీ పడ్డారు. నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, వీరవాసరం మండలాల నుంచి వ్యాన్‌లు, కార్లలతో ఊరేగింపుగా పాటలు పాడుకుంటూ వశిష్ఠా గోదావరి వద్దకు తీసుకొచ్చారు. అక్కడ పూజలు అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు. ముందస్తుగా పోలీస్‌లు ఆజ్ఞలు జారీ చేయడంతో త్రీన్‌మార్, డీజేలు లేకుండానే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

యలమంచిలి: యలమంచిలి, మేడపాడు, అడవిపాలెం, చించినాడ, దొడ్డిపట్ల, గుంపర్రు తదితర గ్రామాల్లో గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. డీజేలు, యువత నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్పులతో ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం గణనాధుని విగ్రహాలను వశిష్ఠ గోదావరిలో నిమజ్జనం చేశారు.

పెనుగొండ: గవడలిలో వినాయకుని గుడి వద్ద వినాయక విగ్రహాన్ని చౌదరీస్ యూత్ సంఘం సభ్యులు మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అనంతరం సిద్దాంతం వశిష్ఠగోదావరిలో నిమజ్జనం చేశారు. అదేవిధంగా వివేకానంద సెంటర్‌లో బాలల యూత్ ఆధ్వర్యంలో పురవీధులలో ఉత్సాహంగా ఊరేగించి గోదావరిలో నిమజ్జనం చేశారు.



పెనుగొండ మండలంలో వినాయకుడి ఊరేగింపు

భీమవరం టౌన్: భీమవరం పట్టణంలో దాదాపు 50 శాతం వరకు విగ్రహాలను ఆదివారం నాడు నిమంజ్జనం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వాహనాల్లో మంగళ వాయిద్యాలు, చిన్నారుల నృత్యాలు, తీన్ మార్ డప్పులు, విచిత్ర వేషాలతో ఊరేగింపుగా స్వామివారిని విస్సాకోడేరు వంతెన వద్ద ఉన్న జిఅండ్‌వి కెనాల్‌లోను, తాడేరు వంతెన వద్ద కాల్వలో నిమంజ్జనం చేశారు.



భీమవరంలో భక్తుల వినాయక నిమజ్జనాలు